


"నువ్వు నువ్వు కాదోయ్!" అన్నారు కృష్ణమూర్తిగారు ఉన్నట్టుండి.

ఆయనే మంటున్నారో అర్థం కాలేదు నాకు. అప్పుడప్పుడు ఇలాంటి గంభీర ప్రకటనో, ప్రశ్నో నా మీద విసరడం, నేను దాన్ని పట్టుకొని వేళ్లాడి, గింజుకుపోయి, సతమతమవుతూంటే, ఆయనే దాన్ని గాలి దెబ్బకి మబ్బు పింజల్లా విడదీసేయడమూ అలవాటే ఇద్దరికీని.

నిన్న రాత్రి భోజనం చేసి ఉడ్‌లాండ్స్ వాడిచ్చిన పేము కుర్చీల్లో చల్లగాలిలో కూచున్నప్పుడు అన్నారాయన. "కంచికి పోదామోయ్ రేపొద్దున్నే" అని. మద్రాసు వచ్చిన పని ఎలాగూ అయిపోయింది కదా అని సరేనన్నాను. పొద్దున్నే మొదటి బస్సు ఎక్కాము. వీథులింకా జనాన్ని పోసుకోలేదు. బస్సు వేగంగా పోతోంది. మా ముందు సీట్లో ఓ కొత్త జంట కువకువలాడిపోతోంది నాకు తెలియని తమిళంలో. ఈ తమిళుల ఆడపడచులకు అదేమి వెర్రో కానీ తలనిండా తట్టెడు పువ్వులు పెట్టుకుంటారు. అందులోనూ వేసవి కాలం. విరజాజి పూలు కుప్పలే కుప్పలు. కిటికీ పక్కనే కూచున్న అమ్మాయి జడలో నించి గాలి దురుసుతనానికి పువ్వులు ఒక్కొక్కటే విడివడి విసురుగా వచ్చి నా మీద పడుతున్నాయ్! తప్పో, ఒప్పోగానీ చెప్పొద్దూ నాకూ సరదాగా, గమ్మత్తుగా ఉంది అలా పూల వాన కురుస్తుంటేను.

సరిగ్గా అప్పుడన్నారు కృష్ణమూర్తిగారు - "నువ్వు నువ్వు కాదోయ్" అని. కొద్ది క్షణాల పాటు ఆయనేమన్నారో అర్థం కాలేదు. "నేనుకాకపోవడమేమిటీ?" అన్నాను పూలవానకి అడ్డంపడినందుకు కొంచెం విసుగ్గానే. ఆయనతో నా పరిచయం ఏడాదే. అయినా - చిన్నప్పుడు మా తాత నా చేతిని తన కుడిచేతి వేళ్ల మధ్య అర చేతిలో బిగించి మెరీనా బీచ్ ఇసుకలో నడిపించి నీలాగాధ మహా సాగరాన్ని చూపించినట్టు - లోకంలో కొత్త అంచుల్ని చూపిస్తున్నారాయన.

"ఎందుకోయ్ అంత విసుగు? అసలీ సంగతి ఆలోచించావా ఎప్పుడైనా?" మళ్లీ ప్రశ్న.

"ఇందులో ఆలోచించడానికేముంది? నేను నేనే - రామకృష్ణని" అన్నా.

"అది నువ్వు పుట్టాక కొన్ని రోజులకి మీ అమ్మా నాన్నా పెట్టిన పేరు. ఆ పేరు పెట్టకముందు నువ్వెవరివి?" ఆయన కళ్లు చిలిపిగా నవ్వుతున్నాయి.

"ఇదేదో తిరకాసు వ్యవహారంలాగే ఉంది" అనుకున్నాను కానీ జవాబు దొరకలేదు.

"పోనీ! ఇప్పుడు నువ్వెవరివి?" మళ్లీ ఏదో మెలికపడుతోంది.

"నేను లెక్చరర్ని కదా?" అన్నాను కొంచెం అనుమానంగానే.

"మరి రిటైరైన తర్వాత?" చిలిపితనంతోపాటు గడుసుపోకడ కూడా కనిపిస్తోంది ఆయన కళ్లల్లో.

మళ్లీ సమాధానం శూన్యం.

బస్సు ఏదో పల్లంలోకి జారుతోంది. గుండె ఉన్నట్టుండి కిందకి వెళ్లిపోతున్న అనుభూతి క్షణంసేపు. కృష్ణమూర్తి గారి ప్రశ్నలోపల్లోపల సుడి తిరుగుతోంది.

ముందు సీట్లో అమ్మాయి తల్లో నించి పువ్వులు పడుతూనే ఉన్నాయి మొహం మీదా, ఒళ్లోనూ. బస్సు శ్రీ పెరంబుదూరు చేరుతోంది. దూరంగా రామానుజుల ఆలయ గోపురం కనిపిస్తోంది. బాగా చిన్నతనంలో తాత అంగ వస్త్రాన్ని పంచెలా కట్టుకొని, ఆయన పక్కనే నిలుచుని - రామానుజుల విగ్రహానికి అభిషేకం చేస్తూ అర్చకులు ఆలపించిన "తిరుమజ్జన కట్టియమ్" చెవుల్లో మోగుతోంది అర్థం కాకపోయినా. ఆ రోజు ఆరగించిన కదంబ ప్రసాద పరిమళం నాసాపుటాల్లో పీస్తోంది. అప్పుడు స్ఫురించింది జవాబు - ఇక దీనికి తిరుగులేనే లేదు -

వెంటనే అన్నాను. "నేను వైష్ణవుడిని" అని.

"ఎప్పట్నుంచీ?" అన్నారాయన సాగదీస్తూ.

"ఎప్పట్నించేమిటి?, నేను పుట్టిన్నాటి నుంచీను" అన్నాను గర్వంగా.

"అలాగే! అదృష్టవంతుడివేయ్! నేను పుట్టాక కొన్నేళ్లకిగానీ, మా నాన్న మనం ఫలానా అని చెబితేగానీ తెలియలేదు. నువ్వు పుట్టగానే - లేదూ - పుట్టుకతోనే "నేను వైష్ణవుడిని" అని పుట్టావు. నీలాంటి వాళ్లు చాలా అరుదేయ్!" అన్నారు.

పోయింది, ..రికిందనుకున్న జవాబు గోదాట్లో గడ్డిపోచలా కొట్టుకుపోయింది. నిజమే ఆయన చెప్పింది.మా తాత చెబితే కదా తెలిసింది నేను ఫలానా అని. ఇది మన బుద్ధికి అందే జవాబు కాదు. ఆయనే విప్పాలి ముడి. ఆయనే చెబుతారని మౌనంగా ఉండిపోయాను. ఆయనా పలకరించలేదు చాలాసేపటి వరకూను. చివరికి నేనే ప్రశ్నించాను. "అయితే ఇంతకీ నే నెవరంటారూ?" అని. నా గొంతులో పలికిన జాలికి నాకే ఆశ్చర్యం వేసింది. బహుశా బిక్క మొహం పడిపోయే ఉంటుంది నాకు తెలియకుండానే.

పువ్వులు ఎన్ని పెట్టుకుందో కానీ ఆ మహాతల్లి మొహానికొచ్చి తగిలాయి రెండు మూడు పువ్వులు. ఇప్పటిదాకా ఆ పూలవాన ఆనందంగానే ఉంది. కానీ ఇప్పుడు మహాచిరాగ్గా అనిపించింది. కొంతసేపు ఆనందం అనిపించింది. మరుక్షణం చిరాకుగా ఎందుకనిపిస్తుంది? మనసు ఇంకో దాని మీద లగ్నమై ఇది ప్రతిబంధకంగా తోస్తుంది కాబోలు.

"అవునేయ్! అదే కదా ప్రశ్న. ఆలోచించు. నువ్వు రామకృష్ణవి అని అమ్మా నాన్నా చెప్పారు. అవుననుకున్నావ్. నువ్వు లెక్చరర్‌వి అంటున్నారు. నిజమే అన్నావు. నువ్వు ఫలానా కులం వాడివి అన్నారు. సరేనన్నావ్. ఇవేవీకాదని తేలిపోయింది. కనుక నువ్వెవరివనే ప్రశ్న నిలబడింది రాకాసిలాగ. ఆలోచించాలి కదా! పద, పద, కంచి వచ్చేసింది. మఠం దగ్గర దిగితే ఆలయాలు దగ్గర" అంటూ లేచారు కృష్ణమూర్తిగారు. బస్సు దిగి ముందు ఏకామ్రేశ్వరాలయానికి వెళ్లాము.

ఎంత పెద్ద శివలింగం! ఇలాంటివి ఆంధ్రదేశంలో తక్కువ. పైగా గర్భాలయంలో తైలదీపాల మసక వెలుతురు. ఆ మసక వెలుతురులో ఏ గుహాంతర్భాగంలోనో మొలుచుకొచ్చిన వెలుతురు స్తంభంలాగా ఎంత అందంగా ఉంది ఆ శివమూర్తి! అలా చూస్తుంటే పుష్పదంతుడు గుర్తుకొచ్చాడు -

"బహులరజసే విశ్వోత్పత్తౌ భవాయ నమోనమః, జన సుఖకృతే సత్త్వోద్రేకే మృడాయ నమో నమః, ప్రబల తమసే తత్సంహారే హరాయనమః, ప్రమహసి పదే నిస్త్రై గుణ్యే శివాయనమో నమః."

ఆయన త్రిగుణ విరహితుడు, వెలుగుల కుప్ప. అప్పుడాయన పేరు శివుడు. ఆ వెలుగే రజో సంసర్గం చేత విశ్వ సృష్టి సాగించినప్పుడు 'భవుడు' అని పేరు. ఆ వెలుగే సత్త్వ సంపూరితమై జనహితకరమైనప్పుడు "మృడుడు" అని పేరు. ఆ వెలుగే తమోవృతమై సంహార కార్య సమగ్నమైనప్పుడు "హరుడు" అని పేరు.

ఏదో లీలగా స్ఫురిస్తోంది - అసలు స్వరూపం ఒకటి కాగా కార్య వృత్తులను బట్టి ఏవేవో పేర్లు వస్తున్నాయన్నమాట. ఈ పేర్లు కానిదేదో మూలాధారంగా నిలిచి ఉందన్నమాట. పక్కన ఎవరున్నారో తెలియనంత స్థలకాల స్మృతి విహీనమైన మనస్సుతో కలలోలాగా నడుస్తూ బయటికి వస్తుంటే కృష్ణమూర్తి గారన్నారు "కూచుందామా?" అని - "వద్దు! అమ్మ వారిని చూద్దాం" అని నా సమాధానం.

కామాక్షి ఆలయానికి వెళుతుంటే యుగాలు నడుస్తున్నట్లుంది. ఆలయంలోకి ప్రవేశిస్తుంటే అమ్మ ఒడిలోకి పాకుతూ వెళ్లిన అనుభూతి వచ్చగా విరుస్తోంది. అమ్మ! ఎంత అందంగా ఉంది! ఎంత భయంకరంగా ఉంది! ఎంత అభయంకరంగానూ ఉంది!

**ఉన్మేష నిమిషోత్పన్నవిపన్నభువనావళి!**
**కామేశ బద్ధ మాంగల్య శోభిత కంధర!**
**శ్రుతి సీమంత సిందూరీకృత పాదాబ్జ ధూళిక!**
**నామ రూప వివర్జిత!!**

అవును! ఆమె నామ రూప వివర్జిత! మరి నా కెందుకు నామ రూప బద్ధ స్పృహ! అయితే మరి నే నెవరిని?

కృష్ణమూర్తి గారి వైపు చూశాను. ఆయనా నాకేసే చూస్తున్నారు పరిశీలనగా. ఆయన కళ్లల్లో బస్సులో కనిపించిన చిలిపితనం కాదు, తీక్షత ఉంది. అదీ ప్రాభాతార్క కిరణంలా ఉంది. గుండెలోతుల్లోకి దూసుకుని పోతున్న నిశాత శరధారలా ఉంది. ఆయన కళ్లల్లో నించి పూలవాన కురుస్తోంది. అది బస్సులో పూలవానలా లేదు. చందన వర్షంలా ఉంది. ఇంద్రియ ప్రపంచం చల్లగా, వెచ్చగా విచ్చుకుంటోంది.

నిత్య యవ్వని నాగకన్యక యుగ యుగాల నిద్రలో బద్ధకంగా శరీర వలయాలను సద్దుకుని, మణిమయ ఫణామండలాన్ని ఓసారి అటూ ఇటూ కదిపి లేచిన పొదలిక -

వాడి, ఎండి, పగిలి, నెరద పెదవి మీద తొలి వాన చినుకు టప్పున పడగానే ఆ విరులు లేచి, వ్యాపించిన మట్టి తావి -

సన్నగా రాజుకొని, ఊదా రంగులో మెదలి, కాషాయారుణవర్ణం లోనికి కదలి, నీల వర్ణానికి తిరిగి, నాలుకలు చాచి ఎక్కడెక్కడో ప్రాచీన ప్రాకృతిక మనో కుహరాంతరాల్లో పేరుకుపోయిన అంధకారాన్ని తాకి, తాగి, విలయంగా, లయంగా, విపరీతంగా, పరీతంగా, ఋతంగా తాండవించడానికి ఒళ్లు విరచుకొని లేస్తున్న మంటల జాతర -

ఎక్కడో సముద్ర గర్భాంధకారంలో - అతడి నేలను చీల్చుకుని, అగ్ని కీలలను ఉత్క్రమించి, వాయుపథాలను తరించి, వినీల విహాయసాన్ని తాకి, అమృత సింధువులో వెన్నెల వెలుగులో బిందువై, ఛందమై, వెలుగ్రై, ఎలుగ్రై, స్ఫోటమై, గాటమై, గానమై, ప్రాణమై, వీణలా, వేణువులా, మర్దళనాద మహస్సులా, క్రోంకారం, ఓంకారం సాకారంగా ఎదుట నిలిచినట్లయి -

హృదయంలో ఏనాడో - యుగ యుగాల నాడు అవిర్భవించి కంఠ గ్రంథిలో చిక్కుపడిపోయి - "మోగక చలించి చెరబడ్డ మూగ బాధ" చిన్నప్పుడు చదువుకున్న శ్లోకం వెతుక్కుంటూ వస్తే తడుముకుంటూ చదివినట్టు వచ్చింది -

"ధరణి మయీం తరణి మయీం పవనమయీం గగన దహన మయీం హొతృమయీం, అంబుమయీ మిందుమయీ మంబామనుకంపమాది మామీక్షే" - అవును! భూమి, సూర్యుడు, గాలి, ఆకాశం, నిప్పు, నీరు, చంద్రుడు అన్నింటినీ ఆవరించినది అమ్మ! అవన్నీ నన్నావరించుకున్నాయి. నన్నేమిటి? సర్వ మానవులలోనూ ఉన్నాయి. అందరిలాగే నేనూను. ఇవన్నీ కలిసి వచ్చిన ఆకారానికి పేర్లు, ఊర్లు, ఉద్యోగాలూ ... అవన్నీ కాకుండా ... అవును! అదే కృష్ణమూర్తి గారి ప్రశ్నకు సమాధానం! సమస్త సుఖదుఃఖాలలో, సమస్త స్పంద నైక్యతా స్పందంలో... నా పేరు లేదు, రూపం లేదు, కులం లేదు, మతం లేదు, దేశమూ లేదు! స్థల కాల పరిధులు లేవు! సమస్త ప్రపంచాన్ని ఆవాసం చేసుకున్న సకల మానవాళీ నేను! వారి సమస్త స్పందనలూనావి! ఎక్కడైనా, ఎప్పుడైనా అవన్నీ ఒకటే!

"నేను మనిషిని" అన్నాను కృష్ణమూర్తి గారి వైపు చూస్తూ -

ఆయన చిరునవ్వులో అమ్మకన్నుల అమృత వర్షం!

"పొద్దున్నుంచీ చెప్పడమే మరచిపోయాను! గుడ్ మార్నింగేయ్ రామకృష్ణా!" అన్నారాయన. ●

### తస్మాత్ జాగ్రత్త!

నీ తిరస్కారం
నా ప్రేమకు మృత్యువైనప్పుడు
నీ నల్లని కురుల్లో
పలితకేశమై వుడతా!

కృష్ణ